శ్రీ దుర్గా స్తోత్రము

ఆంగ్లమూలం :

శ్రీ అరవిందులు

ఆంధ్రానువాదం :

(దండకరూపం)

శ్రీ గడియారం వేంకట శేషశాస్త్రి

ప్రకాశకులు :

శ్రీ మాతృక్షేత్రం ట్రస్టు

నర్సంపేట — 506 132

వరంగల్ జిల్లా

మూల్యం : రు. 3-00

శ్రీ

శ్రీ దుర్గాస్తోత్రం

(దండక రూపం)

(శ్రీ అరవిందుల కృతికి అనుకృతి)

1) జయ! జనని! దుర్గే! శివప్రేయసీ!
సర్వశక్తిప్రదే! సంహవాహాధిరూఢే!
భవచ్ఛక్తి లేశాంశ సంజాతులున్
ఋావనోద్భాసితుల్ భారతోర్వీ సముద్భూతులౌ మేము
నిమందిరంబందునన్ నిల్చి ప్రార్థించుచున్నాము.
మాతా! మొరాలింపవే! భారతక్షోణి నావిర్భవంబందవే!

2)తల్లి! దుర్గే! యుగశ్రేణు లన్నింటిలో మర్త్యులై పుట్టుచున్,
జన్మజన్మంబు లన్నింటిలో నీదు కార్యంబులన్ దీర్చుచున్:
మీఁద నీశాశ్వతానంద ధామంబులున్ జేరుచున్నాము:
నేఁడట్టులే నీదు కార్యంబులన్ దీర్పఁగా
దీక్షతోఁ బుట్టియున్నాము; మాదౌ మొరాలింపవే!
భారతక్షోణి నావిర్భవం బందుచున్
మాకుఁ దోడ్పాటు సేయంగదే!

3) తల్లి! దుర్గేశ్వరీ! సింహవాహే!
త్రిశూలాంకహస్తే! జయశ్రీసనాథే!
తడుత్రాణ సంఛాద నోద్దీపితాకార సౌందర్యరాశీ!
మహాదేవి! నీకోస మీ భారతక్షోణి యత్తైత్తి
చూపెట్టియుండెన్,
భవద్దివ్య రూపావ లోకోత్సుకత్వంబునన్ వేచియుండెన్,
మొరాలింపవే! భారతక్షోణి నావిర్భవంబందవే!

4) తల్లి! దుర్గేశ్వరీ! సత్త్వదే! ప్రేమదే! జ్ఞానదే!
శక్తిసంపన్మయీ! భీమసౌమ్యాతి రౌద్రస్వరూపీ శివే!
జీవనోపాధి సంగ్రామరంగంబునన్
భారతోర్వీక సంగ్రామ రంగంబునన్
నీవు ప్రేరేపఁగా యోధులై నిల్చి యున్నాము:మాతా!
యిదే మామనఃప్రాణ వృత్తుల్ విజృంభింపఁగా
వానికిన్ రాక్షసంబౌ బలం బుద్యమంబిచ్చి,
యీ మా మనీషాత్మశక్తుల్ ప్రకాశింపఁగా,
వానికిన్ దైవికంబైన శీలంబు విజ్ఞానమున్ గూర్చి
పాలింపవే! మామొరాలింపవే!

5) తల్లి! దుర్గే! జగజ్జాల విఖ్యాత మీ భారతీజాతి (-గదే!
యీనాఁడు గాఢాంధకారంబునన్ మున్గి పెంపేది యుండెన్-
నీవు ప్రాచీదిశా ప్రాంగణంబందు దీపింపఁగా,
నప్డె నీ దివ్యదేహ ప్రభల్ దోఁచి,
యీ చీఁకటింబాపి ప్రత్యూషరోచిస్సు లిచ్చుంగదే!
తల్లి! తేజఃప్రసారంబు వచ్చుంగదే!
యీతమోరాశి నాశంబు సేయంగదే!

6) తల్లి! దుర్గేశ్వరీ! శ్యామలా!
సర్వసౌందర్య రేఖాకళా పుష్కలా!
ప్రేమవిజ్ఞాన శక్త్యాలయంబైన యీ భారతక్షోణి
నీదౌ విభూత్యంశమేయౌఁగదా!
యీమె యిన్నాళ్ళు నించించుకే!
స్వీయశక్తిన్ సమార్జించుకొం.
చాత్మసంగోపనాయత్తయై యుండె:
నిప్డిప్పుడే యాగతం బీయుగం-బాగతం బీదినంబెంచి,
యావన్మహా భారతీయోరు భారంబునెల్లన్
భుజస్కంధమందుంచికొంచున్.
సముత్క్షిప్తశీర్షంబుతోలేచి నిల్చున్న దోతల్లి!
దుర్గేశ్వరీ! రాఁగదే!
యింక నీభూమి నావిర్భవం బీఁగదే!

7) తల్లి! దుర్గాంబికే మేము నీకన్న సంతానమే గామొకో
నీప్రసాదంబుచే నీ ప్రభావంబుచే
నీమహాకార్యమందున్ మహాలక్ష్యమందున్
సమర్థాత్వమున్ బొందఁగానిమ్మ! మాతా!
తొలగింపవే క్షుద్రభావమ్మ! మాతా!
మలంగింపవే స్వార్థ వృత్తమ్మ! మాతా!
భయాందోళనంబెల్ల మాయింపవే!

8) తల్లి! దుర్గే! కపాలాస్థిమాలే!
కృపాణాఢ్యహస్తే! వివస్త్రే! మహాకాళి!
దైతేయ సంహారిణీ! క్రూరసంరావిణీ! దేవి!
మాలో నిగూఢారివర్గంబు
నీయట్టహాసంబుతో సుంతదాక్షిణ్యముంజూప
కొక్కండుసున్ జారిపోకుండ నిర్మూలముంజేయవే!
మమ్మ సంశుద్ధ బుద్ధాత్మలన్ జేయవే!
నిన్నుఁ బ్రార్థింతు మీయొక్కటే! తల్లి! యావిర్భవంబీయవే!

9) తల్లి! దుర్గేశ్వరీ! భారతక్షోణి యీనాఁడు
క్షుద్రాశయ స్వార్థభీత్యాదులన్
జాలదైన్యంబునన్ బ్రుంగియుండెన్ గదే!
దీనిఁ బాపంగ-మమ్మున్
మహాసత్త్వులన్గా, మహోద్యోగులన్గా,
సుదారాత్ములన్ సత్య సంకల్పులన్గా
సమర్థించి దీపించి పాలింపవే!
యెన్నఁడే నల్పమో హీనమో దాని
నెద్దానినిన్ గోరకుండం గటాక్షింపవే!
యిందునావిర్భవంబందవే!
10)తల్లి! దుర్గేశ్వరీ! నీమహాయోగశక్తిన్
బ్రయోగోప యోగాది సంభారసంస్కార
విస్తారముంజేయవే!
తావకంబైన యీ యార్యసంతానమం
దిప్డు లుప్తంబులై యున్న
మేధాతపస్యా సదాబ్రహ్మ చర్యంబులన్
శక్తియున్ భక్తియున్ శ్రద్ధయున్ జ్ఞానమున్
సత్య నిష్ఠావెకంబెల్ల వేవేగమే యుద్ధరింపంగదే!
వాని నన్నింటి నీవిశ్వము దెందునెండున్ బ్రసారింపవే!
సర్వదౌర్గత్య సంహారిణీ! లోకసంతారిణీ!
యీ ప్రజానీకముం గావఁగా నిందు నావిర్భవంబందవే!

11)తల్లి! దుర్గేశ్వరీ!
యస్మదంతర్గ తారివ్రజంబెల్లఁ బోకార్చి,
యీ బాహిరంబైన విఘ్నంబులన్
బాధలెల్లన్ నివారించి కాపాడవే!
సత్త్వవంతంబు ధీరంబు
శూరం బుదారంబునౌ భారతీజాతి
ప్రేమంబునం దైక్య భావంబునన్
సత్త్వ సత్యంబులన్ జ్ఞానయోగంబులన్.
శిల్పసాహిత్య సంగ్రామ రంగంబులందెందు
సర్వోన్నతింబొంది రాణింపఁ,
దత్తత్కళా సుందరోద్యాన మధ్యంబులన్
దత్కళారమ్య కేదారసస్యంబులన్
దత్కళాప్రోన్నతాద్రీంద్ర శృంగంబులన్
దత్కళాపుణ్య ధున్యగ్రతీరంబులన్
నిత్య సంవాస సంచార సౌఖ్యంబులందం
గటాక్షింపవే! తల్లి!
నీపాదపద్మంబులన్ ముట్టి
మేమిట్టి విజ్ఞప్తియే సేయుచున్నాము:
నీవింక నావిర్భవంబందవే!

12)తల్లి! దుర్గాంబ: నీయోగశక్తి ప్రభావంబుతో
మాశరీంబు లందెల్లనిండన్ ప్రవేశింపవే!
నీదుశస్త్రంబులందేము
సర్వాశుభధ్వంసియౌ ఖడ్గమౌనట్టు
లజ్ఞాన విధ్వంసియౌ దీపమౌనట్లు
కాంక్షించుచున్నాము: యోగేశ్వరీ!
నీదు సంతానమౌ మావిశుద్ధాత్మలన్
భారతీయాత్మలందీ మహాకాంక్ష పూరించి పాలింపవే!
ధీరధీరంబుగానేఁడు మాముంగలన్నిల్చి
నీయంత్రశక్తిన్ జలాయింపవే!
వాడియౌ నీకటారిన్ దుటాయింపవే!
జ్ఞానదీపంబు చేపట్టి వెల్గింపవే!
యిట్టులీభూమి నావిర్భవం బందవే!

13)తల్లి! దుర్గేశ్వరీ! నీవు మాసేవకుంజిక్కుచో
నిన్ను మేమెన్నఁడున్ వీడఁగాఁబోము:
మాప్రేమతో భక్తితో నిన్ను బంధింపఁనేర్తు:
మోతల్లిరో! రమ్ము! రారమ్ము!
మా మా మనఃప్రాణ కాయమ్ములందిప్ప
డావిర్భవింపంగ రా రమ్ము :
హేవీరమార్గైక సందర్శినీ: రమ్ము మాజీవనం బెల్లనెల్లప్పుడున్
మాతృపూజాపరార్థంబె యౌఁగాక!
మాసేవనంబెల్ల నెల్లప్పుడున్
మాతృసేవాపదార్థంబె యౌఁగాక!
నీపాదమూలమ్మునన్
బ్రేమసంపూర్ణమున్ శక్తిమంతంబు మాప్రార్థనబింతయే:
తల్లి! దుర్గేశ్వరీ! యీ మహాభూమిపైనింక
లీలావతారంబు చూపంగ!దమ్మా!
మహాదేవి! యీ భారతక్షోణిపై నింకఁ
బూర్ణావతారంబు సేయంగదమ్మా!
నమస్తే: నమస్తే: నమస్తే: నమః

గడియారము వేంకట శేషశాస్త్రి

మా మాట

శ్రీ అరవిందులు 'భవాని మందిర్' యను రహస్య విప్లవ సంస్థను క్రీ.శ. 1906-7 సంవత్సరములో స్థాపించినారు. అందులో పనిచేయు దేశభక్తులకు ఆధ్యాత్మిక శక్తి కావాలని, దానిని ప్రసాదించే దుర్గాదేవిని బెంగాలి భాషలో స్తోత్రము చేసినారు. వారే దానిని ఆంగ్లభాషలోనికి అనువదించారు ఈ స్తోత్రమును తెలుగు లోనికి దండకము రూపములోనికి బ్ర.శ్రీ గడియారం వేంకట శేషశాస్త్రిగారు అనువదించారు. ఈ దండక స్తోత్రము శ్రీ అరవింద విద్యాకేంద్రములందు చదువు విద్యార్థుల ఉపయోగార్థము ముద్రిచుట జరిగినది.

భవదీయ

చదలవాడ కృష్ణారావు

మేనేజింగ్ ట్రస్టు

'మాతృక్షేత్రం ట్రస్టు'

నర్సంపేట.

నర్సంపేట

తేది : 4-4-1995